# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 27 బుధవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 120

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


**ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడులను మంగళవారం కలిసి కీలక ప్రాజెక్టుల గురించి చర్చించారు.**

## అంతర్జాతీయ ప్రమాణాలతో

# బాపూ ఘాట్ అభివృద్ధి



**దానికి అవసరమైన 222 ఎకరాల రక్షణశాఖ భూములు బదిలీ చేయండి**

**కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి**

**మామునూరు విమానాశ్రయ పనులకు అనుమతివ్వాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి వినతి**

దిల్లీ: దిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడులను మంగళవారం కలిసి కీలక ప్రాజెక్టుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా రక్షణమంత్రిని కలిసిన సీఎం.. హైదరాబాద్‌లో ఈసీ, మూసీ నదుల సంగమ స్థలంలోని బాపూఘాట్ అభివృద్ధికి రక్షణశాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మహాత్మాగాంధీ చితాభస్మాన్ని కలిపిన చోట ఏర్పాటుచేసిన బాపూ ఘాట్‌ను ప్రపంచస్థాయిలో గాంధీతత్వాన్ని చాటే కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున.. కేంద్రం ఇందుకు సహకరించాలని వినతిపత్రం సమర్పించారు. బాపూఘాట్ వద్ద గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే విజ్ఞానకేంద్రం, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోదస్థలాలు, శాంతి విగ్రహం, మ్యూజియంలతో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రికి వివరించారు.

విమానాశ్రయాల అనుమతులు వేగంగా ఇవ్వండితెలంగాణలో విమానాశ్రయాల నిర్మాణంపై కేంద్రం దృష్టి సారించి వేగంగా అనుమతులివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడిని కోరారు. వరంగల్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని(ఎన్‌వోసీ) రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ నుంచి పొందిందన్నారు. 253 ఎకరాల భూసేకరణకు అవసరమైన రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థ(ఏఏఐ)కి అందజేసిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భద్రాద్రి జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించామని మంత్రికి రేవంత్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీ-ఫీజిబిలిటీ సర్వేలో తేలినందున.. దానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించిందని.. అక్కడ విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాలకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని చెప్పినందున ఆ భూమి సేకరించి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రామ్మోహన్‌నాయుడికి రేవంత్ వివరించారు. కేంద్ర మంత్రులను కలిసిన కార్యక్రమాల్లో సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఆర్.రఘురాంరెడ్డి, కడియం కావ్య పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అనంతరం కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ పూర్తయిన తర్వాత దాని నిర్మాణం కోసం ఎయిర్‌పోర్టు అథారిటీ తరఫున వేగంగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కొత్తగూడెం, పెద్దపల్లిల్లో రాష్ట్రప్రభుత్వం చూపిన స్థలాలపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామన్నారు.





## ఇథనాల్ పరిశ్రమను

# తరలించాల్సిందే

దిలావర్‌పూర్:నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా 61వ నంబరు జాతీయ రహదారిపై దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, రత్నపూర్‌కాండ్లి గ్రామాల ప్రజలు మంగళవారం పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఉదయం 11 గంటలకు మొదలైన ఆందోళన రాత్రి 9.30 గంటల వరకు కూడా కొనసాగింది. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. సాయంత్రం 5 గంటలకు రహదారిపైనే వంటావార్పు నిర్వహించి.. అక్కడే భోజనం చేశారు. చీకటిపడటంతో సెల్‌ఫోన్ల వెలుతురులో నిరసన కొనసాగించారు. ఇథనాల్ పరిశ్రమను తరలిస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తమ ఉద్యమానికి మద్దతు తెలపడం లేదని ఆందోళనకారులు మండిపడ్డారు. వారు కనబడటం లేదంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పరిశ్రమను తరలించకుంటే ఆత్మహత్యకు పాల్పడతామంటూ పలువురు మహిళలు పురుగుమందు డబ్బాలను చూపారు. ఆందోళన కారణంగా జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికుల వాహనాలను పోలీసులు మరోమార్గంలో పంపించారు. లారీలు ఇటు నిర్మల్ వరకు, అటు భైంసా వరకు నిలిచిపోయాయి. ఆందోళన మొదలైనప్పటి నుంచి పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న స్థలంలో, గ్రామంలోనూ పోలీసులను పెద్దఎత్తున మోహరించారు. ఘటన స్థలాన్ని ఎస్పీ జానకి షర్మిల సందర్శించారు.




## మూసీ 'ప్రక్షాళన' జరగాల్సిందే

- అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించాల్సిందే
- నదిలో మురుగు నీరు కలవకుండా చూడాలి
- ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోండి
- నిర్వాసితుల గుర్తింపునకు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించండి
- పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి
- ఇళ్ల కూల్చివేతలపై హైకోర్టు మార్గదర్శకాలు

నదీగర్భం, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లలో చట్టవిరుద్ధంగా, అనధికారికంగా ఉన్న నివాసాలను తక్షణమే ఖాళీ చేయించడంతోపాటు మూసీలోకి మురుగు, కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది.



# ఇస్లామాబాద్‌లో రణరంగం..

**డీ-చౌక్‌కు చేరుకున్న ఆందోళనకారులు**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్ ఖాన్ ను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ మద్దతుదారులు చేపట్టిన ఆందోళనలతో రాజధాని రణరంగంగా మారింది. భారీ స్థాయిలో భద్రతా దళాలు అడ్డుకున్నప్పటికీ.. ముందస్తుగా పిలుపునిచ్చినట్లుగానే నగరం నడిబొడ్డు డీ-చౌక్‌ను ఆందోళనకారులు చేరుకున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు ఆరుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 100 మంది గాయపడినట్లు పాక్ ప్రభుత్వం వెల్లడించింది. రాజధానిలో శాంతి భద్రతల పరిస్థితి చేయిదాటిపోవడంతో సైన్యాన్ని రంగంలోకి దించిన ప్రభుత్వం.. హింసాత్మక ఘటనలకు పాల్పడేవారిని కాల్చివేయాలని ఆదేశించింది.పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై సుమారు 200 కేసులు నమోదు కాగా.. ప్రస్తుతం ఆయన అడియాలా జైల్లో ఉన్నారు. సామాన్యుల అక్రమ అరెస్టులు, ప్రస్తుత ప్రభుత్వ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా నవంబర్ 24న దేశవ్యాప్త నిరసనలు చేపట్టాలని ఇటీవల ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఇస్లామాబాద్‌లో నిరసనలు చేపట్టేందుకు పీటీఐ మద్దతుదారులు సిద్ధమయ్యారు. దీంతో రాజధానిలో లాక్‌డౌన్ ఆంక్షలు విధించిన పోలీసులు.. నగరంలోకి నిరసనకారులు ప్రవేశించకుండా అడ్డుకున్నారు. అయితే, నగరం చుట్టూ వేసిన బారికేడ్లను తొలగించుకుంటూ చొచ్చుకొచ్చిన ఆందోళనకారులు.. భద్రతా సిబ్బందిపై దాడులకు తెగబడ్డారు. చివరకు అధ్యక్ష, ప్రధాని కార్యాలయాలతోపాటు పార్లమెంటు, సుప్రీం కోర్టులున్న డీ-చౌక్ వద్దకు చేరుకున్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేసేంతవరకు ఇక్కడ నుంచి కదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

- మాగనూరు స్కూళ్లో వికటించిన మధ్యాహ్న భోజనం
- 21మంది విద్యార్థులకు అస్వస్థత..
- వారం రోజుల్లో వరుసగా రెండో ఘటన
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు




**భరోసా ఇచ్చేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం సిగ్గుచేటు**



## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల వ్యవహారం

- కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలకులదే పాపం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

2లో..

## దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు..

- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ భారీ విజయం ఖాయం
- రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదే
- ఢిల్లీవాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతది
- ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం..
- కానీ నాలుగేళ్లు వేచి చూడాల్సిందే
- మీటింగులలో కేసీఆర్‌ను తిట్టటమే సిఎం పని
- ప్రజల దగ్గరకు పోతే జనాలు సీఎంను ఛీ కొట్టే పరిస్థితి




**కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది నేరెళ్ల బాధితులకు న్యాయం చేశాం..కేసీఆర్ మాత్రమే తెలంగాణ మనిషి. సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో కేటీఆర్**

వేగుచుక్క

# 29న సీడబ్ల్యూసీ సమావేశం

**ముంబై:** మహారాష్ట్ర రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాలను మూటగట్టుకున్న నేపథ్యంలో ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం కాబోతోంది. ఈ నెల 29న సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని అగ్ర నేతలందరూ ఈ సమావేశంలో పాల్గొంటారు. మహారాష్ట్ర, హర్యానాల్లో గెలిచేందుకు మంచి అవకాశాలున్నా కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవడగానికి కారణాలు ఏమిటి..? లోపాలు ఎక్కడున్నాయ్..? అనే అంశాలు సీడబ్ల్యూ సమావేశంలో చర్చకు రానున్నాయి. అదేవిధంగా దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. కాగా, ఈ మధ్య కాలంలో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయాలను చవిచూసింది. ఆ రెండు రాష్ట్రాల్లోనూ గెలుపు తమదేనన్న ధీమాతో కాంగ్రెస్ పార్టీ ఉంది. కానీ ఫలితాలు భిన్నంగా వచ్చాయి. హర్యానాలో పూర్తిగా అధికార బీజేపీకి వ్యతిరేక పవనాలు వీచినా.. ఆ పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకోలేకపోయింది. మహారాష్ట్రలో కూడా మహాయుతి కూటమిపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. కానీ ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి దాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో విఫలమైంది.

# వైఎస్ జగన్‌పై ఏసీబీకి ఫిర్యాదు

**అమరావతి:** వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఏసీబీకి ఫిర్యాదు అందింది. అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంపై సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు చక్రవర్తి ఈ మేరకు మంగళవారం ఏసీబీకి ఫిర్యాదు చేశారు. జగన్‌కు రూ. 1,750 కోట్లు లంచం ఇచ్చినట్లు ఫిర్యాదుదారుడు ఆరోపించారు. సెకీతో అదానీ కంపెనీ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంపై విచారణ జరపాలని ఆయన కోరారు. జగన్‌కు అదానీ సంస్థ లంచం ఇచ్చినట్లు అమెరికా విచారణలో తేలిందని వెల్లడించారు. ఒప్పందానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి : షర్మిలఅదానీతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దుచేయాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అక్రమ డీల్‌తో 25 ఏళ్ల పాటు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై పడే భారం రూ.1.50 లక్షల కోట్లు అని.. ఈ డీల్‌ను వెంటనే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి సుదీర్ఘ లేఖను రాశారు. అదానీతో జగన్ చేసుకున్నది అక్రమ ఒప్పందం అని షర్మిల ఆరోపించారు. దీనివల్ల 25 ఏళ్ల పాటు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై పడే భారం 1.50 లక్షల కోట్లు అని అన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అదానీ నుంచి రూ.1750 కోట్ల ముడుపులు అందుకున్న జగన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## మూడు రాజ్యసభ్య సీట్లకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్

**అమరావతి:** ఏపీలో ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ్య సీట్లకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. డిసెంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని వెల్లడించింది. డిసెంబర్ 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన ఉప సంహరణ , డిసెంబర్ 20న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్, అదేరోజు లెక్కింపు ఉంటుందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి పాలై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మూడు నెలల అనంతరం వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు మోపీదేవి వెంకటరమణ, ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు విడుదల వారీగా పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి రాజీనామా పత్రాలను రాజ్యసభ స్పీకర్‌కు అందజేశారు. దీంతో ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి. అనంతరం వెంకటరమణ, బీద మస్తాన్‌రావు టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరగా కృష్ణయ్య తటస్థంగా ఉన్నారు.

# రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన : మాజీ మంత్రి అంబటి రాంబాబు

**అమరావతి:** రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనబెట్టి కక్ష సాధింపు చర్యలకే పరిమితమైందని విమర్శించారు. లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని అన్నారు. లోకేశ్ చెప్పిన విధంగా పోలీసులు నడుస్తున్నారని మండిపడ్డారు. తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రూట్ మెజారిటీ వచ్చింది కాబట్టి తమకు తిరుగులేదని.. పోలీసులు తాము ఏం చెబితే అది చేయాలన్నట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని అంబటి రాంబాబు తెలిపారు. ఎవర్ని పట్టుకురావాలంటే వారిని పోలీసులు పట్టుకురావాలి.. ఎవర్ని లోపల వేయమంటే వాళ్లను లోపల వేయాలన్నట్లుగా నడుస్తోందని విమర్శించారు. ఒక్కొక్క వ్యక్తి మీద ఒకటి రెండు కేసులు కాదు.. 15 కేసులు, 20 కేసులు, 30 కేసులు అని పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు తిప్పుతూ హింసిస్తున్నారని మండిపడ్డారు. బహూశా బ్రిటీష్ వారి పరిపాలన చేసే రోజుల్లో కూడా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిపై ఇన్ని కేసులు పెట్టి ఉంటారని అనుకోవడం లేదని ఎద్దేవా చేశారు. మీడియా, సోషల్‌మీడియాపై అణిచివేత ధోరణిలో కూటమి ప్రభుత్వ నేతలు వ్యవహరిస్తున్నారని అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెడ్‌బుక్ రాజ్యాంగానికి మరి మనం సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. మన కంటే ముందుగా దాని రచయిత నారా లోకేశ్ ఈ సమాజానికి చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఆయన దోషిగా నిలబడాల్సి వస్తుందని చెప్పారు.


## క్షీణించిన రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఆరోగ్యం..!!

**న్యూఢిల్లీ:** భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ఆరోగ్య సమస్యతో చెన్నైలోని ఆస్పత్రిలో చేరారు. ఆయన చిన్నపాటి సమస్యతో అపోలో ఆసుపత్రిలో చేరారు. ఈ మేరకు అపోలో ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటన విడుదల చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ అసిడిటీతో బాధపడుతున్నారని, చికిత్స కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరినట్లు పేర్కొంది. ప్రస్తుతం అతను బాగానే ఉన్నారని, మరో 2–3 గంటల్లో డిశ్చార్జ్ అవుతారని వెల్లడించింది. అతని ఆరోగ్యానికి సంబంధించిన ప్రకటన కూడా %=దీ×% ప్రతినిధి విడుదల చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ అసిడిటీతో బాధపడుతున్నట్లు తెలిపింది. వైద్య పరీక్షల కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరారని చెప్పారు.ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆర్బీఐ అధికార ప్రతినిధి తెలిపారు. మరో 2–3 గంటల్లో డిశ్చార్జి కానున్నారు. చింతించాల్సిన పనిలేదు. ప్రస్తుత ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలం కూడా డిసెంబర్ 10తో ముగియనుంది.ఉర్జిత్ పటేల్ హఠాత్తుగా రాజీనామా చేయడంతో ఆరేళ్ల క్రితం ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ బాధ్యతలు చేపట్టారు. తన పదవీ కాలంలో, కోవిడ్ కారణంగా దేశంలో తలెత్తిన ద్రవ్యోల్బణం సమస్యను నియంత్రించడంలో ఆయన విశేషమైన కృషి చేశారు.

# చిన్నారుల మరణాలన్నీ సర్కారీ హత్యలే

హైదరాబాద్: గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో మరణమృదంగాలా అని మండిపడ్డారు. ఎవరిదీ పాపమని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. చిన్నారుల మరణాలన్నీ సర్కారీ హత్యలే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఉరఫ్ విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, అసమర్థత కారణంగా తన సొంత జిల్లాలోని మక్తల్ మండలం మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మళ్లీ ఫుడ్ పాయిజన్ జరిగిందని దాసోజు శ్రవణ్ అన్నారు. మధ్యాహ్న భోజనం తిని పలువురు విద్యార్థులకు వాంతులు, తల నొప్పి, కడుపు నొప్పితో విద్యార్థులు విలవిలలాడిపోయారని పేర్కొన్నారు. మక్తల్ ఆస్పత్రికి 30 మంది విద్యార్థులను తరలించారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 48 మంది ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల మరణించారని దాసోజు శ్రవణ్ తెలిపారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారని అన్నారు. ఈ పాపం ఎవరిదీ అని ప్రశ్నించారు. ప్రత్యేక విద్యా శాఖ మంత్రి, పూర్తి బాధ్యతలతో ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించకుండా రేవంత్ రెడ్డి నిరంకుశ పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి ఢిల్లీలో బిజీ బిజీగా ఉన్నారని.. ప్రిన్సిపల్ సెక్రటరీ హైదరాబాద్‌లో బిజీగా ఉన్నారని.. ఈ ఘటనలపై కనీస రివ్యూ కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం మీద బడుగు,

బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో తమ నిర్లక్ష్యంతో, అసమర్ధతతో చెలగాటం ఆడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరనేరానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిద్దరూ ప్రజాకోర్టులో శిక్షార్హులే అని స్పష్టం చేశారు. విద్యార్థులు మరణిస్తున్నా ఈ ప్రభుత్వంలో చలనం ఉండదా అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురై 20 రోజులకు పైగా చికిత్స పొంది గురుకుల విద్యార్థిని శైలజ మరణించిన మరుసటి రోజే.. మళ్లీ ఉమ్మడి పాలమూరులో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కావడంతో 30 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురి కావడానికి ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే కారణమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న ఇప్పటికీ విద్యాశాఖ, హోం శాఖ, మున్సిపల్ శాఖ మంత్రుల నియామకానికి దిక్కేలేదు అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వంలోని అనేక శాఖల మీద పర్యవేక్షణ లేకపోవడం మూలంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని అన్నారు. ఏడాది పాలనలో గురుకుల విద్యను దిగజార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ఎవరెస్టు శిఖరం ఎత్తుగా ఉన్న గురుకులాల ప్రతిష్టను కాంగ్రెస్ భ్రష్టు పట్టించిందని అన్నారు.



# స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

**హైదరాబాద్:** ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మిని పోలీసులు అడ్డుకోవడంపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామా నికి వెళ్తున్న ఎమ్మెల్యేతోపాటు ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. తల్లిదండ్రుల ఆవేదనను ప్రపంచానికి చూపేందుకు వెళ్తున్న మీడియాను సైతం గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో బారికెడ్లు వేసి అడ్డుకోవడం అప్రజాస్వామికమని, మీడియా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని చెప్పారు. ప్రభుత్వం తమ తప్పేం లేదన్నట్లు వ్యవహరించినంత మాత్రాన విద్యార్థిని ప్రాణం తీసిన పాపం ఊరికే పోదన్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవం అంటూ దేశ వ్యాప్తంగా గొప్పగా జరుపుకుంటున్నాం కానీ, ఆ రాజ్యాంగ సూత్రాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా తుంగలో తొక్కుతున్నదని మండిపడ్డారు.
ప్రశ్నిస్తే కేసులు, గొంతెత్తితే
దాడులు, ప్రజా ప్రతినిధుల హౌజ్ అరెస్టులు, మీడియాపై కఠిన ఆంక్షలని విమర్శించారు.
ఇదేమి రాజ్యం రేవంత్ రెడ్డి అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు. వాంకిడి
గురుకులంలో ఫుడ్ పాయిజన్ వల్ల బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మి సహా ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటు.

# మాగనూరు స్కూళ్లో వికటించిన మధ్యాహ్న భోజనం

**నారాయణపేట:** నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మరోసారి మధ్యాహ్న భోజనం వికటించి 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు రోజు మాదిరిగానే మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం తిన్న తర్వాత 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో వెంటనే వారిని మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.
గత బుధవారం ఇదే పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు కారణాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో మురళీధర్‌రెడ్డి, భోజన నిర్వహణ ఇన్‌ఛార్జి హెచ్ఎం బాపురెడ్డిలను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యా సంచాలకుడు ఈవీ నర్సింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆ పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేశారు. ఆ ఘటన మరువక ముందే మరో 21 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడం గమనార్హం. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
వాంతులు, కడుపునొప్పితో 30 మంది విద్యార్థులు జిల్లా దవాఖానాలో చేరిన దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని అన్నారు. మాటలే తప్ప చేతలు లేని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వాలని.. ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల వ్యవహారం

**హైదరాబాద్:** జేఎన్‌జే జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇండ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కకపోవడానికి పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే ప్రధాన కారణమని విమర్శించారు. 7 ఏళ్ల క్రితం పుస్తెలు తాకట్టు పెట్టి, అప్పు చేసి ఒక్కో జర్నలిస్టు రూ.2 లక్షల చొప్పున రూ.12 కోట్లు పోగు చేసి ప్రభుత్వానికి చెల్లించి జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ పేరుతో స్థలాలు దక్కించుకున్నారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఏదో ఒకసాకు చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు చేతికి అందించకుండా తీవ్రమైన అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో జర్నలిస్టుల బతుకులు మరీ దుర్భరంగా ఉన్నాయని వాపోయారు. ఇండ్ల స్థలాలడిగితే లాఠీలతో కొట్టించారని ఆక్షేపించారు. ప్రశ్నించే జర్నలిస్టులను వారి వృత్తిలో కొనసాగకుండా అడుగడుగునా అవమానించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని బండి సంజయ్ గుర్తుచేశారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య ఫలితమే నేటి సుప్రీంకోర్టు తీర్పు. ఈ రెండు పార్టీలు జర్నలిస్టులను రోడ్డు



పాల్జేయడమే కాకుండా చేతికి వస్తుందని వేయికళ్లతో ఎదురు చూసిన ఇండ్ల స్థలాలను చేతికి అందకుండా చేశాయి. జర్నలిస్టుల నోటికాడ ముద్దను లాగేసుకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టు కుటుంబాల బాధ వర్ణణాతీతం. అసలు జర్నలిస్టులు చేసిన తప్పేమిటి. ఈ రెండు పార్టీలకు జర్నలిస్టులపై ఎందుకంత కక్ష. పైసాపైసా కూడబెట్టి డబ్బులు చెల్లించినా ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా 17 ఏళ్లు జాప్యం చేస్తారా. నేటి సమాజంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్నారు. అయినా తమ వార్తలతో నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు అహర్నిశలు తపన పడతున్నారు. ప్రభుత్వం వాళ్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా అన్యాయం చేస్తోంది. వాళ్లకు హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదు. ఉండటానికి ఇండ్లు లేక అ÷–దదె కట్టలేక, పిల్లల ఫీజులు కూడా చెల్లించే స్థోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కుటుంబం కంటే సమాజాన్ని చైతన్యవంతం చేయడమే ప్రధానమని నమ్మి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూసి ఎంతోమంది జర్నలిస్టులు అసువులు బాశారు. జర్నలిస్టులను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా విఫలమయ్యాయి' అని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
'ఇకనైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు బాధాకరమే అయినప్పటికీ ప్రభుత్వం తనకున్న విచక్షణ అధికారాలను ఉపయోగించి జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలి.
అలాగే గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇండ్లులేని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి భారతీయ జనతా పార్టీ పక్షాన పూర్తిగా సహకరించేందుకు సిద్ధం. అలాగాకుండా ఇండ్ల స్థలాలివ్వకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తే తాము చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. జర్నలిస్టులతో కలిసి మహోద్యమానికి కార్యాచరణ రూపొందిస్తాం. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టిస్తాం. అదే సమయంలో జర్నలిస్టులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని జేఎన్జే హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులతోపాటు రాష్ట్రంలోని అర్హులైన విలేకరులందరికీ ఇండ్లను కేటాయిస్తాం' అని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

# దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు..

**సిరిసిల్ల:** ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే బీఆర్ఎస్ భారీ విజయం సాధించడం ఖాయమని కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదేనని.. ఢిల్లీవాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతదన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని.. కానీ నాలుగేళ్లు వేచి చూడాల్సిందేనన్నారు. సిరిసిల్లలో ప్రజలు ఛీ కొట్టిన సరే అధికారులను అడ్డం పెట్టుకొని ఎగురుతున్న కాంగ్రెస్ సన్నాసులను గుర్తుపెట్టుకుంటామన్నారు. మొన్న సీఎం వేములవాడకు వచ్చాడని.. నాలుగు మంచి మాటలు చెబుతాడనుకున్నానన్నారు. బాలల దినోత్సవమైనా, రాజీవ్ సద్భావన యాత్ర అయినా, ఆయన పుట్టిన రోజు అయినా.. వేములవాడలో మీటింగ్ అయినా సరే కేసీఆర్‌ను తిట్టటమే పని అని.. దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు, కేసీఆర్‌పై తిట్లు ఇవి తప్ప నువ్వేం పీకినవ్ అంటూ మండిపడ్డారు. ప్రజల దగ్గరకు పోతే జనాలను సీఎంను ఛీ కొట్టే పరిస్థితి ఉందన్నారు. కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది అంటూ విమర్శించారు.నేరెళ్లలో ఒక సంఘటన జరిగిందని.. బాధితులకు న్యాయం చేసేందుకు తాను ప్రయత్నం చేశానన్నారు. వాళ్లను కలిశానని.. వీలైనంత వరకు సాయం చేశానన్నారు. మీరు రాజకీయం చేసే ప్రయత్నం చేశారని.. నెరెళ్ల ప్రజలంతా మొన్నటి ఎన్నికల్లో మాకే అత్యధిక ఓట్లు వేశారన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు అంటే ప్రజలతో తిట్లు తిన్నా సరే వారి మనసు గెలుచుకునే ప్రయత్నం చేయాలంటూ చురకలంటించారు. కొడంగల్‌లో రైతులు ఏం అడిగారు.. తమ భూములకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని కోరారన్నారు. తొమ్మిది నెలలుగా నిరసన చేస్తున్నారని.. ధర్నాలు చేస్తున్నారన్నారు. అయినా వాళ్లకు సీఎం సమయం ఇవ్వలేదన్నారు. సీఎం తమ్ముడు, మంత్రులు ఎవ్వరూ వాళ్లు బతిమాలినా పట్టించుకోలేదన్నారు. ఆఖరికి కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే నిరసన తెలిపారని.. అదే రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి.. ఉరికించి కొట్టేవారన్నారు. సీఎం కేవలం అదానీ, తన అన్న, అల్లుడు, బావమరిదికి అమృతం పంచేందుకు మాత్రమే పని చేస్తున్నాడని.. ప్రజల కోసం ఏమీ చేయలేదంటూ మండిపడ్డారు. 28 సార్లు ఢిల్లీకి పోయిండని.. ఫ్లైట్ ఛార్జీలు వృథా తప్ప 28 రూపాయలు కూడా తీసుకురాలేదన్నారు. ఎనిమిది 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని.. వారంతా 8 రూపాయల నిధులు లేదన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న పనులను గమనిస్తున్నారన్నారు.హైదరాబాద్‌లో ఓ ఆటో డ్రైవర్‌తో మాట్లాడితే ఈ ప్రభుత్వం పోయేందుకు ఏదైనా ఉపాయం లేదా అడుగుతున్నాడన్నారు. ఒకసారి ఓటు వేస్తే ఐదేళ్లు శిక్ష పడాల్నా అంటున్నాడని.. తప్పదు మరో నాలుగేళ్లు వీళ్లు పీక్క తింటూనే ఉంటారన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీస అవగాహన, పరిజ్ఞానం కూడా లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిరిసిల్లలో నేతన్నలు ఉన్నారని.. మరి ఇక్కడ పెట్టాల్సిన నూలు డిపోను తీసుకొని పోయి వేములవాడలో పెట్టిండంటూ ప్రశ్నించారు. గుండుకు దెబ్బ తాకితే మోకాలి మందు పెట్టినట్లుగా ఉందన్నారు. ఇంతా తెలివైన వాళ్లు ఉండటం మన అదృష్టమన్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రిని ప్రజలు ఇన్ని తిట్లు తిట్టటం నేను ఎప్పుడు చూడలేదన్నారు. మీడియా, యూట్యూబ్ వాళ్లు మైక్ పెడితే చాలు ఏమాత్రం సంకోచించకుండా రేవంత్ రెడ్డిని పొట్టు పొట్టు తిడుతున్నారన్నారు. ఆ తిట్లు విన్నాక రేషం ఉన్నోడైతే బిల్డింగ్ మీది నుంచి దూకి చస్తాడన్నారు. కానీ, రేవంత్ రెడ్డి కాబట్టి నడిచిపోతోందన్నారు. ఏడాదిలోపే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఊహించలేదన్నారు. మనం పిలుపునిస్తే ఈ ప్రభుత్వానికి ప్రజలే సంవత్సరీకం పెట్టే పరిస్థితి ఉందన్నారు. అమ్మ విలువ, అన్నం విలువ లేనప్పుడే మనకు తెలుస్తుందన్నారు. అదే విధంగా ఇప్పుడు గ్రామ గ్రామాన కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో నాచారంలోని చెప్పుల దుకాణం, హుజుర్‌నగర్‌లో నాయీ బ్రహ్మణుడి షాప్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగిస్తుంటే వాళ్లు కేసీఆర్ ఎక్కడ ఉన్నావంటూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎలక్షన్ వస్తుందా? కాంగ్రెస్ ను ఎప్పుడు పాతర పెడదామా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.2001 నుంచి ఇక్కడ జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండానే ఎగిరిందని.. మళ్లీ బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ప్రజల్లో కేసీఆర్ పట్ల ఎనలేని వాత్సల్యం, ప్రేమ ఉందన్నారు. దాన్ని ఎలా అనుకూలంగా మలుచుకోవాలన్నదే మనం చేయాల్సిన పనన్నారు. మనుషులుగా మనం కూడా తప్పులు, పొరపాట్లు చేసి ఉండవచ్చని.. వాటి నుంచి ఏం నేర్చుకున్నామన్నదే ముఖ్యన్నారు. ఆనాడు 'కేసీఆర్ సచ్చుడో%ౌ%తెలంగాణ తెచ్చుడో' అని కేసీఆర్ ఏ విధంగా తెలంగాణ తెచ్చారో గుర్తు చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ స్ఫూర్తితో కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా మహా సంకల్ప దీక్ష చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ తెచ్చిన దానికన్నా కేసీఆర్‌కు వచ్చే పెద్ద పేరు ఇంకేమీ లేదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు, తెలంగాణ రైతులు, నేతన్నలు, వృద్ధులు, తెలంగాణ ప్రజానీకానికి మేలు జరగాలంటే కేసీఆర్ కావాలన్నారు. విడిపోతే.. చెడిపోతాం అంటూ మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఒక నినాదం బాగా పాపులర్ అయ్యిందని.. మనం కూడా ఎన్నికలు వస్తే విడిపోకుండా జాగ్రత్త పడాలని.. లేకపోతే అన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ మీద గులాబీ జెండాకు ఉన్న ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉండదని.. కేసీఆర్ మాత్రమే తెలంగాణ మట్టి మనిషి అవుతాడని.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ మనుషులేనన్నారు.
మన నాయకుడి పోరాటం, తెలంగాణ విద్యార్థుల బలిదానాన్ని దీక్షా దివస్ సందర్భంగా మరోసారి గుర్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఇయ్యాక తప్పని పరిస్థితిని తీసుకొచ్చింది కేసీఆర్ అని.. నవంబర్ 29, 2009 నాడు కేసీఆర్ అనే బక్క మనిషి, ఉక్కు సంకల్పంతో చేపట్టిన దీక్ష కారణంగానే తెలంగాణ సాధ్యమైందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటైన జూన్ 2వ తేదీ ఎంత ముఖ్యమో.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక మలుపు అయిన దీక్షా దివస్ నవంబర్ 29 అంతే ముఖ్యమన్నారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వ తేదీ వరకు పదకొండు రోజులు జరిగిన దీక్ష కారణంగా అనివార్యంగా తెలంగాణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఏ రోజైతే తెలంగాణ ప్రకటన వచ్చిందో అదే డిసెంబర్ 9వ తేదీని విజయ దివస్‌గా జరుపుకుందామన్నారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరికలు జారీ చేశారు.

వేగుచుక్క

# వండడానికి ముందే ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,ధర్పల్లి, నవంబర్ 26 :**



ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. భోజనం వండడానికి ముందే ప్రతీ రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యతా లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని ఆదేశించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, వాటి కాలపరిమితిని తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, భోజనం నాణ్యతను పరిశీలిస్తున్నారా అని ఉపాధ్యాయులను ఆరా తీశారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసినట్లైతే తహశీల్దార్ కు సమాచారం అందించాలని, వాటి స్థానంలో నాణ్యమైన సరుకులు కేటాయించేలా చర్యలు తీసుకుంటారని కలెక్టర్ సూచించారు. విద్యార్థిని, విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు వంతుల వారీగా ఆహార పదార్థాల నాణ్యతను తప్పనిసరి పరిశీలించాలని ఆదేశించారు. కాగా, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నీటి వసతి, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కడైనా సౌకర్యాల లేమి ఉన్నట్లయితే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టేందుకు వీలుగా వెంటనే ప్రతిపాదనలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ధర్పల్లి ఎంపీడీఓ బాలకృష్ణ, తహశీల్దార్ మాలతి తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.

## - అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్.

**వేగుచుక్క న్యూస్, గాంధారి, నవంబర్ 26:**



విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మంచి భోజనం అందించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. మంగళవారం గాంధారి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ రోజు మధ్యాహ్నం విద్యార్థినులకు ఏర్పాటు చేసిన భోజనం ను ఆయన పరిశీలించారు. వంటలు తయారు చేసే సమయంలో శుభ్రత పాటించాలని, ప్రతీ వంటకంపై మూతలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని తెలిపారు. విద్యార్థులు హ్యాండ్ వాష్ సరిగా చేస్తున్నారో లేదో పరిశీలించాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రోజూరోజూకూ

# పెరుగుతున్న చలి తీవ్రత

## సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.3 డిగ్రీలుగా నమోదు



**హైదరాబాద్:** తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి ఎకువగా ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఇక ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.3 డిగ్రీలు నమోదయింది. అదేవిధంగా న్యాల్కల్‌లో 9.6 డిగ్రీలు, గుమ్మడిదలలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇక మెదక్ జిల్లా శివ్వంపేటలో 10 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 10.2 డిగ్రీలు నమోదయింది.

సోమవారం రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రికార్డయిన విషయం తెలిసిందే. సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 8.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలు నమోదైంది. జోగులాంబ గద్వాలలో 15.1, సూర్యాపేటలో 15.6, వనపర్తిలో 15.9 డిగ్రీలుగా నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటమే చలి తీవ్రత పెరగటానికి కారణమని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 27 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో ఉష్ణోగ్రతలు తకువ స్థాయికి పడిపోతుంటాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో నవంబర్‌లోనే చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పదేళ్లతో పోల్చితే ఈ నెల 23న రాత్రి నాలుగు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

# భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరూ చదవాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.






**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 26:**

భారత రాజ్యాంగం గురించి ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 26న మనం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ కమిటీలో ఉండి రచించారని తెలిపారు. విద్యార్థి దశ నుండే రాజ్యాంగం గురించిన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంతకు ముందు విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఏం.సత్యవతి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జవహర్ నవోదయ విద్యాలయం సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. డేటా ఎంట్రీ త్వరగా తప్పులు లేకుండా నిర్వహించాలని, అదనంగా లాగిన్స్ తీసుకోవాలని సూచించారు.

అనంతరం విద్యాలయంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్య శాఖాధికారి శ్రీపతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీఓ గంగాధర్, విద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు.

## - రాజనీతి శాస్త్ర అధ్యాపకులు వీరేశంకు సన్మానం.


**వేగుచుక్క న్యూస్, తాడ్వాయి, నవంబర్ 26:**



మండలం లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్ర పటానికి ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్ అధ్యాపకులు పూల మాలలు వేశారు. అనంతరం కళాశాలలో రాజనీతి శాస్త్రాన్ని బోధిస్తున్న అధ్యాపకులు వీరేశంకు అధ్యాపకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాజనీతి శాస్త్ర అధ్యాపకులు వీరేశం మట్లాడుతూ, భారత రాజ్యాంగం యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే దేశంలో నేడు అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛాయుత జీవితాలను అనుభవిస్తున్నారని అన్నారు. కుల, మత ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ ఒక్కటిగా కలిసి ఉంటూ జాతి సమైక్యతకు కాపాడు తున్నారని పేర్కొన్నారు.

అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అన్ని వర్గాలకు సమాన న్యాయాన్ని పంచుతూ పరిపాలన కొనసాగిస్తు న్నాయని వివరించారు. భారతదేశ ప్రజలందరూ కులమత బేధం లేకుండా ఐకమత్యంలో కొనసాగేందుకు రాజ్యాంగం ఎంతగానో తోడ్పడుతుందని ప్రతి విద్యార్థి ఉత్తమ మార్గంలో పయనిస్తూ రాజ్యాంగ ఫలాలను భావితరాలకు అందజేయాలని సూచించారు. భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలలోనే అత్యున్నత మన రాజ్యాంగమని దీని ప్రాధాన్యతను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు.సంతోష్, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంగన్నగారి శ్రీకాంత్, మల్లేశం, హరిక, సతీష్, శ్రీకాంత్, సిబ్బంది.నరసయ్య, సోటేరియా, లక్ష్మి పాల్గొన్నారు.



# ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా చదవలేదు : రాహుల్

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ కచ్చితంగా రాజ్యాంగాన్ని చదవలేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదన్న గ్యారెంటీ ఇవ్వగలనని అన్నారు. ఒకవేళ ఆయన ఈ పుస్తకాన్ని చదివి ఉంటే, ప్రతి రోజు ఇలాంటి పనులు చేసేవాడు కాదు అని రాహుల్ అన్నారు. సంవిధాన్ రక్షక్ అభియాన్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిందని, కులగణన అనేది సమాజానికి మెగా హెల్త్ చెకప్ లాంటిందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేది గాంధీ కుటుంబం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. మేం అంతా ఆ కుటుంబం వైపు మద్దతుగా ఉన్నామన్నారు.

# బాదాలో భారీగా పోలీసుల మోహరింపు




**ఆసిఫాబాద్:** ఫుడ్ పాయిజన్‌తో మరణించిన వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ స్వగ్రామం బాదాలో పోలీసులు భారీగా మోహరించారు. శైలజ మృతదేహం ఆసిఫాబాద్ జిల్లా బాదా గ్రామానికి చేరుకున్నది. దీంతో ఆమె బంధువుల, గ్రామస్తులు అంబులెన్స్‌ను చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆమె డెడ్‌బాడీని అందులోని నుంచి దించకుండా అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అడుగడుగునా మోహరించారు. గ్రామంలోకి ఇతరులు ఎవరూ రాకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. సరైన ధృవపత్రాలు చూపిన తర్వాతే గ్రామానికి అనుమతిస్తున్నారు. మీడియాపై ఆంక్షలు విధించారు. కాగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మిని కూడా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ఎమ్మెల్యే.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తనను ఎందుకు వెళ్లనీయడం లేదని ప్రశ్నించారు. బాదాకు వెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు.

వేగుచుక్క

# నన్ను సెకండ్‌హ్యాండ్ అన్నారు : సమంత



నాగచైతన్యతో విడాకుల గురించి సమంత తాజాగా మరోసారి స్పందించారు. డివోర్స్ తర్వాత తనపై చాలా రూమర్స్ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నో ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చారు. కొందరు తనను 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత మాట్లాడుతూ.. 'విడాకులు తీసుకుంటే దాన్ని జనం ఫెయిల్యూర్‌గా పరిగణిస్తారు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా కష్టంగా ఉంటుంది. పెళ్లైన నాలుగేళ్లకే చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత నేను ఎన్నో తీవ్రమైన ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నా. నన్ను కొందరు 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారు. నాపై చాలా రూమర్స్ వచ్చాయి. ఎన్నో అబద్ధాలు వ్యాప్తి చెందాయి. అవన్నీ నిజం కాదని చాలా సార్లు బయటకు వచ్చి చెప్పాలని అనిపించింది. కానీ చెప్పడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని ఆగిపోయాను' అంటూ సామ్ చెప్పుకొచ్చింది.

# 27కు రాంగోపాల్ వర్మ విచారణ వాయిదా




ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈనెల 27కు ఏపీ హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో రాంగోపాల్ వర్మపై ఒంగోలు, విశాఖ, గుంటూరు జిల్లాలో కేసులు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసులో పోలీసులు రెండు సార్లు నోటీసులు అందించినా వర్మ విచారణకు హాజరుకాలేదు. దీంతో వర్మ కోసం పోలీసులు హైదరాబాద్, తమిళనాడులో గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టులో ఆర్జీవీ ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేశారు. ఆర్జీవీ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుగగా విచారణ రేపటికి వాయిదా పడింది. ఈ నెల 23న కోయంబత్తూరులో షూటింగ్‌లో పాల్గొన్నట్టు తెలియజేస్తూ.. యాక్టర్లతో దిగిన ఫొటోలను ఎక్స్‌లో ట్వీట్ చేశాడు వర్మ. ఈ నేపథ్యంలో ఏపీ పోలీసులు రాంగోపాల్ వర్మ కోసం కోయంబత్తూరు వెళ్లినట్టు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే వర్చువల్‌గా విచారణకు హాజరవుతారని వర్మ లీగల్ టీం పోలీసులకు తెలియజేసిన విషయం తెలిసిందే. ఒంగోలు పోలీసులు మొదట హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి కూడా వెళ్లారు. అయితే వర్మ అక్కడ లేకపోవడంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారని తెలిసిందే. వర్మ ఫోన్ స్విచాఫ్ వస్తున్నట్టు కూడా వార్తలు వచ్చాయి.

# భయపెట్టేందుకు వస్తున్న వేదిక

బాణం, రూలర్, శివలింగ, కాంచన 3 సినిమాలతో టాలీవుడ్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది వేదిక . ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా.. వీటిలో ఒకటి ఫియర్. ఈ సినిమాకు లక్కీ లక్ష్మణ్ నిర్మాత హరిత గోగినేని కథనందిస్తూ దర్శకత్వం వహిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయగా.. చీకట్లో ముఖంపై చేతులు పెట్టుకొని భయంగా కనిపిస్తున్న లుక్ ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచుతోంది. కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. భయంకరమైన ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ధైర్యంగా మిమ్మల్ని మీరుసిద్ధం చేసుకోండి. వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మిస్తుండగా.. సుజాత రెడ్డి సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఆండ్రీవ్ బాబు



# ఆయన నాకు తండ్రిలాంటి వారు : మోహిని





ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ తన భార్య సైరా భానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక రెహమాన్ దంపతులు విడాకులు ప్రకటించిన గంటల వ్యవధిలోనే రెహమాన్ మ్యూజిక్ బృందంలోని బాసిస్ట్ మోహినీ దే కూడా తన భర్తతో విడాకులు ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. దీనిపై మోహిని మరోసారి స్పందించారు. రెహమాన్ తనకు తండ్రిలాంటి వారని చెప్పుకొచ్చారు. తనది, రెహమాన్ కుమార్తెలది ఒకే వయసు అని.. ఆయనెప్పుడూ తనని కుమార్తెలానే చూసేవారని తెలిపింది. ఎనిమిదేళ్లుగా ఆయన బృందంలో పనిచేస్తున్నట్లు తెలిపింది. రెహమాన్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేసింది. ఆయన తనకు తండ్రితో సమానమని స్పష్టం చేసింది. తన కెరీర్‌లో ఆయన కీలక పాత్ర పోషించారని వివరించింది. అలాంటి తమపై ఇలాంటి వార్తలు రావడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి సున్నితమైన అంశాల్లో సానుభూతి లేకుండా నిందలు వేయడం సరికాదని పేర్కొంది. ఇక్కడితో ఈ రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి.. తమ గోప్యతను గౌరవించాలని కోరింది. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేసింది. ఏఆర్ రెహమాన్ 1995లో సైరా భానును వివాహం చేసుకున్నారు. ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఈ జంట విడిపోతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. 29 ఏళ్ల వైవాహిక జీవితానికి ఇద్దరూ పరస్పర అంగీకారంతో ముగింపు పలికారు. ఇక ఈ దంపతులకు ఖతీజా, రహీమా, అమీన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముగ్గురు పిల్లలకు పెళ్లయ్యింది. వైవాహిక బంధంలో ఏర్పడిన భావోద్వేగ క్షణం

# అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో శ్రీలీల





టాలీవుడ్ యాక్టర్ బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే. బాలకృష్ణ సీజన్ 4లో ఎంటర్‌టైన్ మెంట్ డోస్ పెంచుతూ కొత్త కొత్త సెలబ్రిటీలతో సందడి చేస్తున్నాడు. ఇటీవలే పుష్ప 2 ది రూల్ ప్రమోషన్స్‌లో భాగంగా పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో బాలకృష్ణతో సందడి చేశాడని తెలిసిందే. ఈ ఎపిసోడ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. భగవంత్ కేసరిలో బాలకృష్ణతో కలిసి నటించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోకు మంచి ప్రశంసలు దక్కాయి. తాజాగా బాలయ్య, శ్రీలీల మరోసారి సందడి చేయబోతున్నారన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజాగా మరో అతిథిగా డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలను ఫైనల్ చేశారు మేకర్స్. శ్రీలీల అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూట్‌లో జాయిన్ అయింది. స్లీవ్ లెస్ టాప్, చీరకట్టులో క్యారవాన్ ముందు హొయలు పోతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రీలీల ఎపిసోడ్ ప్రోమో ఎప్పుడొస్తుందనేది తెలియాల్సి ఉంది. అన్‌స్టాపబుల్ షోలో శ్రీలీల తర్వాత రాబోయే గెస్ట్ నవీన్ పొలిశెట్టి అని ఫిలింనగర్ సర్కిల్ టాక్.

# ఇక్కడ ప్రతిదీ కష్టమే

ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చితనకంటూ ప్రత్యేకంగా ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కృతిసనన్. తెలుగులో మహేశ్ బాబుతో వన్ నేనొక్కడినే, నాగచైతన్యతో దోచెయ్ సినిమాల్లో మెరిసిన ఈ భామ ప్రస్తుతం హిందీపైనే ఫోకస్ పెట్టిందని తెలిసిందే. ఈ బ్యూటీ 2024 ఈవెంట్‌లో సందడి చేసింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో ఇండస్ట్రీలో నెపోటిజమ్ (బంధు ప్రీతి)తోపాటు తన డ్రీమ్ రోల్ ఏంటో చెప్పుకొచ్చింది. డ్రీమ్ రోల్ గురించి మాట్లాడుతూ.. నాకు సూపర్ ఉమెన్ పాత్ర చేయాలని ఉంది. పూర్తిగా నెగెటివ్ పాత్రలో నన్ను నేను ఆవిష్కరించుకోవాలనుకుంటున్నానని చెప్పింది. నెపోటిజమ్‌కు ఇండస్ట్రీ పెద్దగా బాధ్యత వహించదని నేను భావిస్తున్నా. కానీ ఈ విషయంలో మీడియా, ప్రేక్షకులు చాలా కీలక పాత్ర పోషిస్తారు. కొందరు స్టార్ కిడ్స్ పట్ల మాత్రం మీడియా ఎలా వ్యవహరిస్తుందో ప్రేక్షకులు చూడాలనుకుంటారు. ప్రేక్షకులు ఆ స్టార్ కిడ్స్ పట్ల ఆసక్తి చూపించడం వల్ల వారితో సినిమా చేయాలని ఇండస్ట్రీ భావిస్తుంది. ఇది ఒక సర్కిల్ అని నేననుకుంటున్నానంది.

మీరు ప్రతిభావంతులైతే ఇండస్ట్రీకి చేరుకుంటారు. ప్రతిభావంతులు కాకపోతే, ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వలేకపోతే, అక్కడికి చేరుకోలేరు. నేను వచ్చినప్పటి నుంచి ఇండస్ట్రీ నాకు సాదర స్వాగతం పలికింది. మీరు సినిమా బ్యాక్ గ్రౌండ్ నుంచి రానప్పుడు.. మీరు కోరుకున్నది అందుకునేందుకు సమయం పడుతుంది. మ్యాగజైన్ కవర్‌లో చోటు సంపాదించుకోవడానికి కూడా టైం పడుతుంది. కాబట్టి ప్రతిదీ

# సినీ నటుడు శ్రీతేజ్‌పై కేసు నమోదు




ప్రముఖ సినీ నటుడు శ్రీతేజ్‌పై కూకట్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదైంది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని శ్రీతేజ్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌పై బీఎన్ఎన్ 69, 115 (2), 318 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. శ్రీతేజ్‌పై గతంలో కూడా ఇదే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీతేజ్ పెళ్లైయిన మరో వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. అక్రమ సంబంధం విషయం తెలిసి గుండెపోటుతో అప్పట్లో బ్యాంక్ ఉద్యోగి సురేశ్ మృతి చెందాడు. బ్యాంక్ ఉద్యోగి మృతితో గతంలో మాదాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వంగవీటి, లక్ష్మీస్ ఎన్టీఆర్, పుష్ప ది రైజ్, మంగళవారం, ధమాకా సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీతేజ్ ప్రస్తుతం పుష్ప ది రూల్‌లో కీలక పాత్రలో

# ప్రతీ విద్యార్థి భారత రాజ్యాంగాన్ని చదవాలి.





**వేగుచుక్క న్యూస్, బిక్నూర్, నవంబర్ 26**

## ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ పిలుపు.
### సౌత్ క్యాంపస్ లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం.

ప్రతీ విద్యార్థి డా. బీఆర్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని చదవాలని టియు సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ పిలుపు.

తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ లో ఎన్ఎస్ ఎస్ యూనిట్ 5, 6 ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా.సుధాకర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతీ విద్యార్థి రాజ్యాంగాన్ని చదవాలని, అందులోని మంచిని గ్రహించి, సమాజానికి అన్వయించాలని అన్నారు. డా.అంబేద్కర్ భారత సమాజానికి రాజ్యాంగం అనే గొప్ప గ్రంథాన్ని అందించారని అన్నారు. మరో వక్త వైస్ ప్రిన్సిపల్ డా.రాజేశ్వరి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని ఆచరించడం లో తేడాల వల్ల అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. ఆచరణ సరిగా ఉంటే అభివృద్ధి ఉంటుందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని అందరూ సరైన పద్ధతుల లో ఆచరించాలని అన్నారు. డా. అంజయ్య మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని వివిధ దేశాల నుంచి మంచిని గ్రహించి రాశారని అందుకు డా.బీ. ఆర్ అంబేద్కర్

చాలా శ్రమించారని అన్నారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని అన్నారు. ఈ కార్యక్రమానికి డా.హరిత అధ్యక్షత వహించారు.

కార్యక్రమంలో వార్డెన్ లు డా. యాలాద్రీ, డా.సునీత, ఉమెన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ వైశాలి, ఎపిఆర్ఓ డా.సరిత పిట్ల, అధ్యాపకులు డా.మోహన్ బాబు, డా.లలిత, డా.నాగరాజు, డా.నర్సయ్య దిలీప్, డా.శ్రీమాత, శ్రీకాంత్, డా.కిషన్, పోతన్న, డా.అఫ్రీన్, డా.శ్రీకాంత్, డా.కనకయ్య, డా.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ బ్యాలెట్ విధానం.. దాఖలైన వాజ్యం కొట్టివేత.
## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 26**

భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని పునః ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ.వి.ఎం. ట్యాంపరింగ్ పై పిటిషనర్ డాక్టర్ కౌల్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని అన్నారు. పిటిషన్ ను తిరస్కరించిన సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసిందని, ఎన్నికలలో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈ.వి.ఎం.ల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తిచూపిందన్నారు. పిటిషనర్ వాదనల్లో ఎలాంటి మెరిట్‌ను కనుగొనలేదని, ఎన్నికల్లో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయ పార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పి.బి.వరాలే లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టర్ తెలిపారు.

# టియులో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, నవంబర్ 26:**





తెలంగాణ విశ్వవిద్యాలయ లో న్యాయ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లా కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి డా. కె. ప్రసన్న రాణి ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. సమకాలిన కాలంలో - రాజ్యాంగ సమీక్ష ఆవశక్యత అనే అంశంపై ఉపన్యాస పోటీ,మన రాజ్యాంగంబి మన గౌరవం అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి స్పెషల్ గెస్ట్ గా నిజామాబాద్ జిల్లా సీనియర్ జడ్జ్ పద్మావతి విచ్చేసి రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యతను, సమకాలిన సమాజంలో రాజ్యాంగం యొక్క సమీక్షలను తెలిపారు.డాక్టర్ బి స్రవంతి మహిళలకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకతలు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# దీక్ష దివస్‌ను విజయవంతం చేయండి.
## - బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 26:**

ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షా దివస్ జిల్లా ఇన్చార్జి ఫారుక్ హుస్సేన్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ జెడ్పీ ఛైర్మన్ విఠల్ రావు తదితరులున్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన.
## - పాల్గొన్న జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి ఉమమహేశ్వర్.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 26:**

నగరంలోని బిసి బాలికల సంక్షేమ వసతి గృహంలో మంగళవారం రవాణా శాఖ, రక్షణ శాఖ సంయుక్త సమన్వయంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి ఉమమహేశ్వర్, బిసి సంక్షేమ శాఖ అధికారి స్రవంతి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, బోధన్ పట్టణ ఎస్ఐ మహేష్, అసిస్టెంట్ బిసి డెవలప్మెంట్ ఆఫీసర్ నరసయ్య, ఐడార్ జిల్లా మేనేజర్ శ్రీ వర్షా హాజరై వసతి గృహ బాలికలకు రోడ్డు భద్రత పై అనేక సూచనలు, సలహాలు మౌఖికంగా, వీడియోల రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారిణి వాణి, శోభ, అంజుమ్ పాల్గొన్నారు.

# జాతీయస్థాయి బేస్ బాల్ శిక్షణ శిబిరానికి "సత్యశోధక్" విద్యార్థులు.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, నవంబర్ 26:**



కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులోని 'ది డాన్ బోస్కో ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ'లో ఈ నెల 28 నుంచి జరిగే జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ శిక్షణ శిబిరానికి సత్యశోధక్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత జూన్ మాసంలో బెంగుళూరులో జరిగిన జాతీయ మేజర్ లీగ్ బేస్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి. శ్రీకాంత్, యస్. స్నేహిత్, కే. అజయ్ లు శిక్షణ శిబిరంలో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య మాట్లాడుతూ, జాతీయ స్థాయి శిక్షణ శిబిరంలో పాల్గొనే అవకాశం రావడం సంతోషదాయకమని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి నైపుణ్యాలు నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్ విద్యార్థుల తల్లిదండ్రులు భూషణ్, శ్రీనివాస్, మాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి.
## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 26**



మహిళా సంఘాల సభ్యులు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం లింగంపేట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆకాంక్ష మేరకు మహిళా సంఘాల సభ్యులు వ్యాపార రంగం ఎంచుకొని అనుభవం, ఆసక్తి గల వ్యాపారాన్ని నిర్వహించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతూ, ఋణాలు సమకూరుస్తున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారాన్ని ప్రారంభించాలని సూచించారు. పాఠశాలల పిల్లల యూనిఫాం కుట్టడానికి మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగిందని, అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు నిర్వహించడం, వరి ధాన్యం కొనుగోళ్లు చేయడం వంటివి మహిళా సంఘాలే నిర్వహిస్తున్నాయని తెలిపారు. వచ్చే సీజన్ నాటికి వరి కొనుగోళ్ళ సంఖ్యను మహిళా సంఘాలే ఎక్కువ చేయాలని తెలిపారు. క్యాంటీన్, డైరీ, ఫిష్ పాండ్, తదితర వ్యాపారాలు కొనసాగించాలని తెలిపారు. సంఘాల్లో మహిళలను సభ్యులుగా చేర్చాలని, ఋణాలు తీసుకున్న వారి నుండి రికవరీ చేయాలని తెలిపారు. లింగంపేట మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలనీ తెలిపారు. అంతకుముందు 36 వేల రూపాయలతో నిర్మించనున్న రూఫ్ టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ మాట్లాడుతూ, 14 అంశాలతో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. మండల మహిళా అధ్యక్షురాలు జి.సులోచన మాట్లాడుతూ, కొత్త గ్రూపులను ఏర్పాటుచేస్తున్నామని పిండి గిర్ణి, నాటు కోళ్లు, డైరీ, క్యాంటీన్, వంటి వ్యాపారాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యురాల్లు, తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్యను అందించాలి.
## - జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 26:**



విద్యార్థులకు మెరుగైన విద్య బోధన అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు మంగళవారం నగరంలోని శంకర్ భవన్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య బోధలను, రిజిస్టర్ను పరిశీలించి ఉపాధ్యాయుల హాజరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు తీసుకువచ్చేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలి అన్నారు. అనంతరం డిఓ ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు వాసుదేవరావు, టీచర్లు వెనిగళ్ళ సురేష్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదిపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి.
## - న్యాయవాదుల ర్యాలీ, మానవహారం.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 26:**

న్యాయవాది ఖాసింపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి, ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలో ల్యాండ్ మాఫియా పెరిగిపోయిందని, శాంతి భద్రతలకు విఘాతం జరుగుతుంది అని, గుడగిరి రాజ్యం ఎలుతుంది అని అన్నారు. దీనిని అరికట్టి శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు. న్యాయవాది ఖాసిం పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేసే వరకు ఆందోళన కార్యక్రమాన్ని విరమించేది లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించారు. ఆందోళనకు స్పందించిన అడిషనల్ డిసిపి బసవరెడ్డి జిల్లా కోర్టు వద్దకు వచ్చి న్యాయవాదులతో మాట్లాడారు. దాడి కేసులో హత్య యత్నం సెక్షన్ ఆల్టరేషన్ చేసే కోర్టులో మేమో దాఖలు చేశామని, అరెస్టుకు బృందాలను ఏర్పాటు చేశామని, కచ్చితంగా అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ మెంబర్ రాజేందర్ రెడ్డి, వసంతరావు, రాజు, సురేష్, పిల్లి శ్రీకాంత్, అయూబ్ , పరుచూరి శ్రీధర్, భాస్కర్, పి వెంకటేష్, మాణిక్రాజ్, ఆశ నారాయణ రాజు, రవీందర్, విగ్నేష్ ,జైపాల్, జునేద్ , ఇర్ఫాన్, జిషంత్, ఇంతియాజ్, ఖలీద్, కవిత రెడ్డి, అంజలి, కావ్య,అఖిల, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ లో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 26**





: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు సమక్షంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. 'భారతదేశ ప్రజలమైన మేము దేశ సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగా నెలకొల్పుటకు, పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ, న్యాయమును, భావము, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధన - వీటి స్వాతంత్ర్యమును, అంతస్తులోనూ, అవకాశంలోనూ సమానత్వాన్ని చేకూర్చుటకు, అందరిలోనూ వ్యక్తి గౌరవమును, జాతి ఐక్యతను, అఖండతను కాపాడేందుకు అంకిత భావంతో కృషి చేస్తామని' ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతిజ్ఞ చేయడానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.